# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 70 22-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## శ్రీవారి క్షేత్ర పవిత్రతను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం

- భక్తులకు చిన్న ఇబ్బంది కూడా రావొద్దు
- ప్రసాదాలు, తాగునీటిలో నాణ్యత కోసం
- టెక్నాలజీని సమర్థంగా వినియోగించాలి
- కల్తీ నివారణే లక్ష్యంగా పని చేయాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు నిర్దేశం
- తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబ్ ప్రారంభం

2లో



2లో

## బెంగాల్‌ఎను టార్గెట్ చేసినవారు నరకానికి వెళ్తారు

- రంజాన్ వేడుకల్లో మమతా బెనర్జీ ఘాటు వ్యాఖ్యలు
- 'బీజేపీ హటావో.. దేశ్ బచావో' నినాదం
- బెంగాల్‌ను టార్గెట్ చేసినవారిపై తీవ్ర హెచ్చరిక
- ఐక్యతకు పిలుపునిచ్చిన సీఎం మమతా

## దేశంలో ప్రతి 45 రోజులకు ఒక కొత్త విమానాశ్రయం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నదే లక్ష్యం

సీఐఐ సదస్సులో కేంద్ర మంత్రి రామ్మోహన్ వెల్లడి



2లో



## నతాంజ్‌పై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు

4,000 కి.మీ. దూరంలోని అమెరికా స్థావరంపైకి క్షిపణులు!

- డీగో గార్సియా పైఇరాన్ దాడులు!
- ఒకటి విఫలం, మరోటి కూల్చివేత?
- అణు కేంద్రంపై బాంబుల వర్షం
- వచ్చే వారం మరిన్ని దాడులంటూ ప్రకటన
- యుద్ధ తీవ్రతను బాగా తగ్గిస్తామన్న ట్రంప్!
- ఇరాన్‌ను పూర్తిగా ఓడించామని వ్యాఖ్యలు
- కాల్పుల విరమణ ఉండదంటూ మెలిక

2లో

దుబాయ్:పశ్చిమాసియాలో యుద్ధ తీవ్రత ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఇజ్రాయెల్‌అమెరికా, ఇరాన్ యుద్ధం శనివారంతో నాలుగో వారంలోకి ప్రవేశించింది. రోజంతా ఇరు వర్గాలూ తీవ్రస్థాయిలో పరస్పర దాడులకు పాల్పడ్డాయి. హిందూ మహాసముద్రంలో మారుమూలన ఉన్న డీగో గార్సియా దీవిలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ అనూహ్యంగా దాడులకు దిగింది. వాటిపైకి రెండు క్షిపణులను ప్రయోగించి అగ్ర రాజ్యానికి ఒక్కసారిగా షాకిచ్చింది! ఒక క్షిపణి మార్గమధ్యంలోనే కుప్పకూలగా మరోదాన్ని ఎస్ఎం3 ఇంటర్‌సెప్టర్‌తో అడ్డుకున్నట్టు అమెరికా పేర్కొంది.



## ఘోర రోడ్డు ప్రమాదం..

- లారీ ట్రావెల్స్ బస్సు ఢీ.. 15 మందికి గాయాలు..!
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- గుడిహత్నూర్ సమీపంలోని చీఎ-44 పై ఘటన
- ట్రావెల్స్ బస్సు ఓవర్‌టేక్ సమయంలో లారీని ఢీ
- ప్రమాదంతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు
- ఘటనలో 15 మంది ప్రయాణికులు గాయాలు..

ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుడిహత్నూర్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వీణఖ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ముఖ్యంగా క్యాబిన్ భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

## గ్యాస్ వినియోగదారులకు కేంద్రం ఊరట

- గ్యాస్ కొరతకు చెక్.. సరఫరా 20% పెంపు
- హోటళ్లు, పరిశ్రమలకు ప్రాధాన్యత
- వలస కార్మికులకు ఉచిత సిలిండర్లు





## తండ్రి గౌరవం కోసం ఒకరు.. ఆస్తుల కోసం మరొకరు!

వైఎస్ కుటుంబంలో ముదిరిన ఆస్తుల తగాదాపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కన్నతల్లి విజయమ్మే స్వయంగా అఫిడవిట్ విడుదల చేసి ఆవేదన వ్యక్తం చేయడం చూస్తుంటే, జగన్ తన స్వార్థం కోసం కుటుంబాన్ని ఎంతలా రోడ్డుపైకి ఈడ్చారో అర్థమవుతుందని ఆయన మండిపడ్డారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ వేల కోట్లు గడించారని, కానీ

2లో

## మూడు దశల్లో 'భద్రాద్రి' పునరాభివృద్ధి

### గోదావరి పుష్కరాల నాటికి మొదటి దశ పూర్తి కావాలి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ పునరాభివృద్ధిని మూడు దశల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి తొలి విడత పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని చెప్పారు. తొలి దశ పనులు వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు. శనివారం రాత్రి ఆయన ఆలయ పునరాభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు తదితరులతో సమీక్షించారు.





## నిర్ణయంలో ఎలాంటి మార్పులేదు, దేవుడు శాసిస్తే మానవుడు అనుసరిస్తాడు: జీవన్ రెడ్డి వ్యాఖ్యలు

- మంత్రులతో చర్చలు ఫలించలేదా..?
- జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయాల్లో సంచలనం
- పార్టీ వీడే సంకేతాలు బలంగా..?
- కరీంనగర్ కాంగ్రెస్‌కు పెద్ద షాక్?

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..


## నిర్ణయంలో ఎలాంటి మార్పులేదు, దేవుడు శాసిస్తే మానవుడు అనుసరిస్తాడు: జీవన్ రెడ్డి వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేత, కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా పేరున్న జీవన్ రెడ్డి తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. జగిత్యాల నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన, పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయనను బుజ్జగించేందుకు రాష్ట్ర మంత్రులు జరిపిన రాయబారం విఫలమవ్వడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జీవన్ రెడ్డిని శాంతింపజేసేందుకు మంత్రులు శ్రీధర్ బాబు , అడ్లూరి లక్ష్మణ్ ఆయన నివాసానికి చేరుకున్నారు. సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా చర్చలు జరిపినప్పటికీ, జీవన్ రెడ్డి తన పట్టు వీడలేదు. చర్చల అనంతరం ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనాన్ని సృష్టిస్తున్నాయి. "దేవుడు శాసిస్తాడు.. మానవుడు అనుసరిస్తాడు" అని పేర్కొంటూ, తన తదుపరి అడుగుపై స్పష్టమైన సంకేతాలిచ్చారు. మంత్రులతో చర్చల తర్వాత కూడా జీవన్ రెడ్డి తన పాత నిర్ణయానికే కట్టుబడి ఉన్నట్లు స్పష్టమవుతోంది. తాను అనుకున్న తేదీలోనే భవిష్యత్తు కార్యాచరణను వెల్లడిస్తానని, అప్పటివరకు వేచి చూడాలని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఆయన తన నివాసంలోని వ్యక్తిగత వస్తువులు, పుస్తకాలు , లైబ్రరీని షిఫ్ట్ చేసే పనుల్లో నిమగ్నమైనట్లు సమాచారం.

జగిత్యాల రాజకీయాలకు స్వస్తి చెప్పి, హైదరాబాద్‌కు తన నివాసాన్ని మార్చే యోచనలో జీవన్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో తన ఆత్మగౌరవానికి భంగం కలిగిందనే ఆవేదనతో ఉన్న ఆయన, కాంగ్రెస్‌తో దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడానికే మొగ్గు చూపుతున్నట్లు సన్నిహిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒకవేళ జీవన్ రెడ్డి పార్టీని వీడితే, అది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మూడు దశల్లో 'భద్రాద్రి' పునరాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పుష్కరాల నాటికి మొదటి దశ పనులు పూర్తిచేసి, పుష్కరాల అనంతరం మిగతా పనులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పుష్కరాల కోసం గోదావరి తీరంలో భక్తులకు వసతి కల్పించాలన్నారు. భక్తుల దర్శనాలు కొనసాగుతుండగానే ఆలయ అభివృద్ధి పనులు జరపనున్నందున, భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలని చెప్పారు. ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా ఆగమశాస్త్రబద్ధంగా పునరాభివృద్ధి ఉండాలని పేర్కొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రమాదంలో మొత్తం 15 మంది ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి ఓవర్‌టేకింగ్ కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## బెంగాల్‌ఎను టార్గెట్ చేసినవారు నరకానికి వెళ్తారు



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీని గద్దె దించి, దేశాన్ని రక్షించడమే తమ ఏకైక లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. కోల్‌కతాలో శనివారం నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ రాష్ట్రాన్ని , ఇక్కడి ప్రజలను టార్గెట్ చేస్తున్న వారు ఖచ్చితంగా నరకానికి వెళ్తారని మమతా బెనర్జీ తీవ్రంగా వ్యాఖ్యానించారు. తమ రాష్ట్రాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న వారికి తగిన శాస్తి జరుగుతుందని ఆమె హెచ్చరించారు. "బిజెపి హటావో.. దేశ్ బచావో" (బీజేపీని తరిమికొట్టండి.. దేశాన్ని రక్షించండి) అనే నినాదంతో ముందుకు వెళ్లాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో బీజేపీని అధికారంలో నుంచి దించడమే తమ ప్రధాన టార్గెట్ అని 'దీదీ' ప్రకటించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని, ఐక్యతను కాపాడుకోవడానికి అందరూ కలిసి రావాలని కోరారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ, అందరూ కలిసికట్టుగా ఉండి దేశ సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కీలక నేతలతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మమతా బెనర్జీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## తండ్రి గౌరవం కోసం ఒకరు.. ఆస్తుల కోసం మరొకరు!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అవే ఆస్తుల విషయంలో తల్లికి, చెల్లి షర్మిలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి వ్యతిరేకంగా తన సొంత మీడియా సంస్థల్లోనే కథనాలు రాయించిన ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందని, ఇది అత్యంత దారుణమని ఆయన విమర్శించారు. ఆస్తుల కోసం కన్నతల్లిని కూడా గౌరవించకుండా ఆమెను కోర్టుల చుట్టూ, మీడియా ముందుకు వచ్చేలా చేయడం వైఎస్సార్ ఆశయాలకే విరుద్ధమని సోమిరెడ్డి పేర్కొన్నారు. జగన్ తీరుకు భిన్నంగా నారా లోకేశ్ ప్రవర్తన ఉందని సోమిరెడ్డి కొనియాడారు. తండ్రి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టినప్పుడు, లోకేశ్ విశ్రమించకుండా పోరాడి మళ్ళీ ఆయన్ను ముఖ్యమంత్రి సీటులో కూర్చోబెట్టే వరకు శ్రమించారని గుర్తు చేశారు. ఒకవైపు జగన్ తన కుటుంబంలో ఆస్తుల కోసం చిచ్చులు పెడుతుంటే, లోకేశ్ మాత్రం తండ్రి గౌరవం కోసం, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని సోమిరెడ్డి విశ్లేషించారు.

# నతాంజ్‌పై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు

(మొదటి పేజీ తరువాయి)



తమ క్షిపణుల గరిష్ట సామర్థ్యం 2,000 కి.మీ. మాత్రమేనని ఇరాన్ ఇప్పటిదాకా చెబుతూ రావడం తెలిసిందే. అలాంటిది తన భూభాగానికి ఏకంగా 4,000 కి.మీ. దూరంలో ఉన్న డీగో దీవిపైకి క్షిపణులు ప్రయోగించగలగడం తీవ్ర కలకలం రేపింది! డీగో గార్సియా అమెరికా, బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం. యూఎస్ బాంబర్ యుద్ధ విమానాలు ఆ దీవిని వాడుకునేందుకు బ్రిటన్ అంగీకరించిన మర్నాడే దానిపై ఇరాన్ దాడికి ప్రయత్నించడం విశేషం. మరోవైపు ఇరాన్‌లోని ప్రధాన అణు శుద్ధి కేంద్రమైన నతాంజ్‌పై ఇజ్రాయెల్ మరోసారి భారీగా క్షిపణి, బాంబుల వర్షం కురిపించింది. అక్కడి నిర్మాణాలను భారీగా నష్టపరిచినట్టు ప్రకటించింది. వచ్చేవారం ఇరాన్‌పై దాడుల తీవ్రత మరింత పెరగడం ఖాయమని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ప్రకటించారు. అమెరికాతో కలిసి ఇరాన్‌పై మరింతగా విరుచుకుపడతామని హెచ్చరించారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించారు. "ఇరాన్‌పై దాడుల ద్వారా ఆశించిన లక్ష్యాలన్నింటినీ దాదాపుగా చేరుకున్నాం. ఆ దేశ వైమానిక, నావిక, క్షిపణి వ్యవస్థలన్నింటినీ నేలమట్టం చేసేశాం. కనుక దానిపై సైనిక చర్య తీవ్రతను క్రమంగా తగ్గించే యోచన ఉంది"అని చెప్పుకొచ్చారు. కాకపోతే కాల్పుల విరమణకు మాత్రం అమెరికా సిద్ధంగా లేదంటూ మెలిక పెట్టారు! ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ట్రంప్ తాజాగా పోస్టులు పెట్టారు. అయితే యుద్ధానికి పూర్తిస్థాయిలో, శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టడం మినహా మరే చర్యలూ ఆమోదయోగ్యం కాబోవంటూ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కుండబద్దలు కొట్టారు. శనివారం ఇజ్రాయెల్ శర పరంపరగా చేసిన దాడులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్ అల్లాడిపోయింది. నగరంలో పలు ప్రాంతాల్లో భారీగా మంటలు, పొగ కన్పించాయి. దేశవ్యాప్తంగా పలు ఇతర నగరాలపైనా భారీ స్థాయిలో దాడులు కొనసాగాయి. నతాంజ్ అణు కేంద్రంపై తాజా దాడుల తర్వాత రేడియేషన్ లీకేజీ నమోదు కాలేదని ఇరాన్‌కు చెందిన మిజాన్ వార్తా సంస్థ పేర్కొంది. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటి నుంచీ నతాంజ్‌పై ఇజ్రాయెల్, అమెరికా ఇప్పటికే పలుమార్లు దాడులు జరిపాయి. మరోవైపు లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై కూడా ఇజ్రాయెల్ దాడులు తీవ్రస్థాయిలో కొనసాగాయి. రాజధాని బీరూట్‌లో పలు ప్రాంతాలు పేలుళ్లతో దద్దరిల్లాయి. ఇరాన్‌లో దాడుల మధ్యే ప్రజలు ఈదుల్ ఫితర్ జరుపుకున్నారు. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ ముమ్మరంగా ప్రతి దాడులకు దిగింది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని మౌలిక సదుపాయాలు, చమురు వ్యవస్థలే లక్ష్యంగా ఇరాన్ వందలాదిగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. దాంతో ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, జెరూసలేంతో పాటు పలు నగరాల్లో భారీగా జనం బంకర్లకేసి పరుగులు తీశారు. క్షిపణి శకలాలు పడి టెల్ అవీవ్‌లో ఒక కిండర్‌గార్టెన్ స్కూలు ధ్వంసమైంది. అయితే ఎవరూ గాయపడలేదు. తమ తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాలపైకి దూసుకొచ్చిన 20కి పైగా డ్రోన్లను అడ్డుకున్నట్టు సౌదీ అరేబియా ప్రకటించింది. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో నిఘా విభాగం ప్రధాన కార్యాలయం డ్రోన్ దాడిలో దెబ్బతింది. ఈ ఘటనలో ఒక అధికారి కూడా మరణించినట్టు ఇరాక్ ధ్రువీకరించింది. డీగో దీవిపై ఇరాన్ దాడి యత్నాన్ని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. అది అత్యంత నిర్లక్ష్యపూరిత చర్య అంటూ నిరసించింది. వాణిజ్య నౌకలపై, గల్ఫ్‌లోని చమురు వ్యవస్థలపై ఇరాన్ దాడులను యూఏఈ, బహ్రెయిన్, బ్రిటన్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియాతో సహా 22 దేశాలు తీవ్రంగా ఖండించాయి.

## దేశంలో ప్రతి 45 రోజులకు ఒక కొత్త విమానాశ్రయం

విశాఖపట్నం, : ఉత్తరాంధ్ర ఇప్పుడు గ్లోబల్ డెస్టినేషన్‌గా మారిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. 'స్వర్ణాంధ్ర-2047' పేరుతో విశాఖపట్నంలో సీఐఐ శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భోగాపురం విమానాశ్రయం, మూలపేట (శ్రీకాకుళం జిల్లా) పోర్టు త్వరలోనే ప్రారంభం కానున్నాయని చెప్పారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్, విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్, అనేక చైన్ హోటళ్లు శంకుస్థాపనలు చేసుకోనున్నాయని వివరించారు. వీటన్నింటిలో సీఐఐ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో కూడా పారిశ్రామిక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. దేశంలో ప్రతి 45 నుంచి 50 రోజులకు ఒక కొత్త విమానాశ్రయం ప్రారంభించాలనే ప్రణాళికతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో భవిష్యత్తు అవసరాలకు 1,700 విమానాలు అవసరమని, రానున్న 16 ఏళ్లలో అవన్నీ సమకూరతాయన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా విమాన ఇంధన ధరలు పెరుగుతున్నాయని, అయితే ఆ భారం ప్రయాణికులపై పడకుండా చర్చలు జరుపుతున్నామని చెప్పారు. గతంలో సంగీతం, క్రీడా పరికరాలను విమానాల్లో అనుమతించలేదని, ఇప్పుడు వాటితోపాటు పెంపుడు జంతువులకు సైతం అవకాశం కల్పించామని వివరించారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల నిర్మాణంతో పాటు 14 ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ 2గంటల ప్రయాణ దూరంలో విమానాశ్రయం ఉండాలని చెప్పారు. రాష్ట్రానికి రూ.22లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి, ఐదేళ్లలో 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రామ్మోహన్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజల్లో నమ్మకం పెంచుకుంటున్నామని చెప్పారు. దావోస్‌లో ఏపీని ఒక రాష్ట్రంలా కాకుండా ఒక దేశంలా భావిస్తూ ప్రాధాన్యమిస్తున్నారని, ఇదంతా సీఎం చంద్రబాబు కృషి వల్లనే సాధ్యమైందని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని జూన్ నెలాఖరుకు ప్రారంభించాలనే యోచనలో ఉన్నామని, ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని మంత్రి తెలిపారు. విమానాశ్రయం బయట పనులన్నీ పూర్తయ్యాయని, టెర్మినల్ లోపల పనులు జరుగుతున్నాయని చెప్పారు. సీఐఐ ఏపీ చైర్మన్ మురళీకృష్ణ గన్నమనేని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దక్షిణ ప్రాంత చైర్మన్, మూత్తూట్ ఫిన్‌కార్ప్ సీఎండీ థామస్ జాన్ కీలకోన్యాసం చేశారు.

## గ్యాస్ వినియోగదారులకు కేంద్రం ఊరట



దేశవ్యాప్తంగా నెలకొన్న గ్యాస్ కొరత సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. అంతర్జాతీయంగా ఇరాన్, ఇజ్రాయెల్ , అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావంతో భారత్‌లో గత మూడు వారాలుగా గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హోటళ్లు, రెస్టారెంట్లు , చిన్న తరహా పరిశ్రమలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను తక్షణమే 20 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గ్యాస్ కొరత కారణంగా అనేక రెస్టారెంట్లు, దాబాలు , హోటళ్లు మూతపడే పరిస్థితి రావడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పెంచిన సరఫరాలో మొదటగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఇండస్ట్రియల్ క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు , డైరీ యూనిట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. అలాగే వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నడిపే సబ్సిడీ క్యాంటీన్లకు కూడా గ్యాస్ కొరత లేకుండా చూడాలని స్పష్టం చేసింది. మరోవైపు వలస కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. వలస కార్మికులకు 5 కిలోల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖలు రాసింది. ఈ ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రక్రియ ఎల్లుండి (మార్చి 23) నుంచి ప్రారంభం కానుంది. గ్యాస్ వినియోగంలో ఎటువంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు కేంద్రం కొన్ని నిబంధనలను విధించింది. కమర్షియల్ యూజర్లు , వలస కూలీలు సంబంధిత యాప్‌ల ద్వారా లేదా గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరని తెలిపింది.

## శ్రీవారి క్షేత్ర పవిత్రతను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడటం, భక్తుల మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమలలో శనివారం ఆయన టీటీడీ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, భక్తుల విశ్వాసాన్ని మరింతగా చూరగొనేలా, పారదర్శకమైన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేవలు అందించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు.దసామాన్య భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. టెక్నాలజీ సహాయంతో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించి, వారికి సులభంగా, త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించాలని ఆదేశించారు. ఇది భక్తులపై మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, దర్శన ప్రక్రియలో పారదర్శకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యి, ఇతర ముడి సరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్‌ను పటిష్టంగా నిర్వహించాలని, కల్తీకి ఏమాత్రం ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. తాను స్వయంగా కొందరు భక్తులను కలిసినప్పుడు వారు ప్రసాదం నాణ్యతపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, ఆ నమ్మకాన్ని నిరంతరం కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. "పేదల సేవయే భగవంతుని సేవ" అనే స్ఫూర్తితో టీటీడీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ వంటి వైద్య సంస్థల ద్వారా అందిస్తున్న సేవలపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. అరుదైన వ్యాధులతో బాధపడే పేద రోగుల చికిత్స కోసం ప్రాణదానం ట్రస్ట్ ద్వారా నెలకు అదనంగా రూ.1 కోటి నిధులను సమకూరుస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన అన్నదానం కార్యక్రమాన్ని టీటీడీ పరిధిలోని 57 ఆలయాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారని, త్వరలోనే మరో 4 ఆలయాల్లో ప్రారంభిస్తామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రధాన దేవాలయాల్లో కూడా అమలు చేసేలా చూడాలని సీఎం సూచించారు. ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.750 కోట్ల వ్యయంతో 5,000 నూతన ఆలయాల నిర్మాణ ప్రణాళికను ముఖ్యమంత్రి సమీక్షించారు. అంతేకాకుండా, దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ తిరుమల శ్రీవారి ఆలయం తరహాలో ఆలయాలు నిర్మించే ప్రతిపాదనలపై దృష్టి సారించాలని ఆదేశించారు. తిరుమల కొండపై శ్రీవారి సేవకుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 17.12 లక్షల మంది సేవకులు తమ సేవలను అందించారని, సాధారణ రోజుల్లో 3000 మంది, రద్దీ రోజుల్లో 4000 మంది వరకు సేవకులు భక్తులకు సేవలందిస్తున్నారని అధికారులు సీఎంకు వివరించారు. అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ వంటి కీలక విభాగాల్లో వారి సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, టీటీడీ ఉన్నతాధికారులు, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి జలాలతో రఘునాథపురం పరవళ్లు

- కేసీఆర్ చిత్రపటానికి రైతుల పాలాభిషేకం
- అపర భగీరథుడు మాజీ ముఖ్యమంత్రి: సర్పంచ్ సంతోష్ గౌడ్

**రాజపేట, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు మల్లన్న సాగర్ నుంచి రాజాపేట మండలం రఘునాథపురం చెక్ డ్యామ్‌కు చేరుకోవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా శనివారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డిల చిత్రపటాలకు గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ నేతృత్వంలో రైతులు ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కరువుతో అల్లాడిన ఈ ప్రాంతం నేడు గోదావరి నీళ్లతో కళకళలాడుతుండటం కేవలం కేసీఆర్ దృఢ సంకల్పం వల్లే సాధ్యమైందని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోతే పాడి పశువులకు కూడా నీరు దొరికే పరిస్థితి ఉండేది కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత సహకారంతో బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్‌ల వల్ల భూగర్భ జలాలు భారీగా పెరిగాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కొండం రాజు, వార్డు సభ్యులు ఎర్ర మల్లేష్, అక్షయ్ కుమార్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రఘునాథపురంలో మార్కండేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా కటకం వెంకటేశం నియామకం
- ఆలయ అభివృద్ధికి పద్మశాలి సంఘం నిర్ణయం




**రాజపేట, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** మండలంలోని రఘునాథపురం గ్రామంలో మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పద్మశాలి సంఘం ఆవరణలో నిర్వహించిన కుల బాంధవుల సమావేశంలో ఈ నూతన కమిటీని ప్రకటించారు. ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు పలువురు సీనియర్లను సలహాదారులుగా, యువకులను కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కటకం వెంకటేశం, గౌరవ అధ్యక్షుడిగా బింగి బాలరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నల్ల అశోక్, బల్ల నరహరి, ప్రధాన కార్యదర్శిగా బల్ల యాదేష్, కోశాధికారిగా బింగి రమేష్ బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శిగా వల్లకాటి బాబురావును నియమించారు. గౌరవ సలహాదారులుగా కటకం నారాయణ, రాచకొండ స్వామి, బోగ లక్ష్మీనారాయణ, గాడిపెల్లి శ్రవణ్ కుమార్, గుర్రం సిద్ధిరాములు, బొద్దుల వెంకటేశం, బోగ వెంకటయ్య, బింగి అశోక్ వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

- రాజపేట ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక నమాజ్
- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

**రాజపేట, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం రంజాన్ పండుగ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు, పండుగను పురస్కరించుకుని శనివారం ఉదయం నూతన వస్త్రాలు ధరించి స్థానిక ఈద్గా వద్దకు భారీగా చేరుకున్నారు. అక్కడ సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాను స్మరించుకున్నారు. లోకకల్యాణం కోసం, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్దకు చేరుకున్న పలువురు రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముస్లిం సోదరులతో ఆలింగనం చేసుకొని 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలో భాగంగా నిరుపేదలకు వస్త్ర దానం, అన్నదానం నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ గౌడ్, టీఆర్ఎస్ (బీఆర్ఎస్) మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్, సర్పంచి కోయ మధు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఎర్రగోకుల జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 'వారాహి' నృత్య పాఠశాల ప్రారంభోత్సవం






- యువత ప్రతిభకు వేదికగా నిలవాలి: చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్
- ఒకే చోట వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్స్, యోగా శిక్షణ
- అట్టహాసంగా ప్రారంభ వేడుకలు.. తరలివచ్చిన కళాభిమానులు

**చౌటుప్పల్, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ పట్టణంలో 'వారాహి డ్యాన్స్ స్టూడియో' శనివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక యువతలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఎడ్ల హిమబిందు రెడ్డి, సామినేని దీపికల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ నృత్య పాఠశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల్లోనూ ప్రావీణ్యం సాధించాలని సూచించారు. ప్రతి ఒక్కరిలోనూ దాగి ఉన్న ప్రతిభను గుర్తించి దానికి సరైన మార్గదర్శకం కల్పిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. పట్టణంలో ఇటువంటి డ్యాన్స్ స్టూడియోలు ఏర్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ మాట్లాడుతూ.. ఒకే వేదికపై వెస్ట్రన్, క్లాసికల్ నృత్యాలతో పాటు యోగా శిక్షణ అందించడం విశేషమన్నారు. ఇది యువతకు శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. స్టూడియో నిర్వాహకులు మాట్లాడుతూ.. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వెస్ట్రన్ డ్యాన్స్ మాస్టర్లు ప్రిన్స్ భరత్, విక్కీ, క్లాసికల్ మాస్టర్ రాజు, యోగా ఇన్‌స్ట్రక్టర్ సరిత ఆధ్వర్యంలో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.




# గుట్టపై 'గోనె' బాట.. భక్తుడి అపర దాతృత్వం!






- పాదాలు కాలకుండా రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ
- మెట్లపై సంచులు పరుస్తూ భక్తులకు సేవల అందజేత

**యాదగిరిగుట్ట, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట క్షేత్రంలో వేసవి వేడి సెగలు పుట్టిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీ స్వామి వారిని దర్శించుకునేందుకు మెట్ల మార్గం ఎంచుకునే భక్తులకు హైదరాబాద్‌కు చెందిన రామచంద్రారెడ్డి అనే భక్తుడు అండగా నిలిచారు. ఎండల వల్ల మెట్లు వేడెక్కి పాదాలు కాలుతున్నాయని, దీనివల్ల భక్తులు నానా అవస్థలు పడుతున్నారని గుర్తించిన ఆయన గోనె సంచులతో మార్గాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి ఆయన స్వయంగా మెట్లపై సంచులను పరుస్తూ కనిపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొంతమంది మిత్రులు, దాతల సహకారంతో పాత గోనె సంచులను సేకరించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు తాగునీరు, చల్లని బాట వంటి కనీస సౌకర్యాల కల్పనలో దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రామచంద్రారెడ్డి చేసిన ఈ పనికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. "స్వామివారి దర్శనానికి వెళ్లే మాకు ఈ గోనె సంచులు ఎంతో మేలు చేస్తున్నాయి" అని పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# భగ్గుమన్న అడవి.. అదుపుతప్పిన మంటలు!



- చౌటుప్పల్‌లో ఎగిసిపడుతున్న అగ్నిజ్వాలలు
- అగ్నిమాపక సిబ్బందికి తోడైన అన్నదాతలు

**చౌటుప్పల్, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** మున్సిపల్ కేంద్రంలోని స్మృతి వనం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం శనివారం భారీ అగ్ని ప్రమాదానికి గురైంది. వేసవి తీవ్రతతో ఎండిపోయిన చెట్లు, పొదలు నిప్పుకణికల్లా మారడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. మంటల తీవ్రతకు పచ్చని చెట్లు సైతం బూడిదవుతుండటంతో స్థానిక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్నిప్రమాదాన్ని గమనించిన రైతులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నప్పటికీ, అగ్ని జ్వాలలు తీవ్రంగా ఎగిసిపడుతున్నాయి. గాలుల వేగం కారణంగా మంటలు మరింత విస్తరిస్తుండటంతో నియంత్రణలోకి తేవడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో అగ్నిమాపక సిబ్బందికి తోడుగా స్థానిక రైతులు కూడా రంగంలోకి దిగి మంటలను ఆర్పేందుకు కృషి చేస్తున్నారు. అగ్ని జ్వాలలతో ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం నెలకొంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు అటవీ ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.





# యాదగిరిగుట్టలో ప్రమాదం: భక్తురాలి కాలిపైకి ఎక్కిన బస్సు

- బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా ఘటన
- క్షతగాత్రురాలు గాంధీ ఆసుపత్రికి తరలింపు

**యాదగిరిగుట్ట, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమైన ఓ భక్తురాలికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నార్సింగ్‌కు చెందిన అనిత తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సాయంత్రం కొండపైకి వచ్చారు. శనివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం వారు తిరుగు ప్రయాణమయ్యారు. కొండపైన ఉన్న బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు అనిత ప్రయత్నిస్తుండగా, ఒక్కసారిగా బస్సు ముందుకు కదిలింది. దీంతో ఆమె అదుపు తప్పి కింద పడటంతో బస్సు వెనుక టైరు ఆమె కాలిపై నుంచి వెళ్ళింది. ఈ ప్రమాదంలో అనిత కాలికి తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయితే కాలి ఎముక చితికి తీవ్ర రక్తస్రావం కావడంతో వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొండపై బస్సుల రాకపోకల సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



## ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు

- మత సామరస్యానికి ప్రతీక రంజాన్: చిరుమర్తి లింగయ్య
- బీఆర్ఎస్ నాయకుడు ఎస్కే చాంద్ నివాసంలో వేడుకలు

**రామన్నపేట, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రామన్నపేట మండల కేంద్రంలో శనివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఎస్కే చాంద్ నివాసానికి చేరుకొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లా ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, మాజీ ఎంపీటీసీ సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నరసింహ మరణం సీపీఎంకు తీరని లోటు

- నిబద్ధత గల కార్యకర్తను కోల్పోయాం: ఎండి జహంగీర్
- పల్లివాడలో ఘనంగా అంతిమ నివాళులు





**రామన్నపేట, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** సీపీఎం నిబద్ధత గల కార్యకర్త, హమాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బైకాని నరసింహ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. శనివారం పల్లివాడలో నరసింహ పార్థివ దేహానికి పూలమాలలు వేసి జోహార్లతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. నరసింహ ప్రజా పోరాటాల్లో ముందుండి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. హమాలీ యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘాల్లో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధిగా కూడా తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. నిరంతరం పార్టీ సిద్ధాంతాల కోసం పరితపించిన నరసింహ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్ కల్లూరి నగేష్, నాయకులు కందుల హనుమంతు, గన్నెబోయిన విజయభాస్కర్, గాదె నరేందర్, తొలుపునూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ పావిరాల మత్స్యగిరి, ముక్కముల మల్లేష్, శాఖా కార్యదర్శులు తాళ్లపల్లి జితేందర్, పులిబిక్షం, మునికుంట్ల లెనిన్, గోగు లింగస్వామి, జనపాల లక్ష్మణ్, వార్డు సభ్యులు గట్టు ఉపేందర్, దండిగ నరసింహ, తొలుపునూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు మహోత్సవానికి ఆహ్వానం

- నర్మెటలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహనకు 150 స్టాల్స్



**చౌటుప్పల్, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న "రైతు మహోత్సవం" కార్యక్రమానికి రైతులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 22న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననున్నారు. రైతు మహోత్సవంలో భాగంగా సుమారు 150 స్టాల్స్ ఏర్పాటు చేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ, డ్రోన్ సాంకేతికత, పంటల ప్రదర్శనలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. అదనంగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, ఆయిల్ పామ్ రిఫైనరీ శంకుస్థాపన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే రైతుల కోసం చౌటుప్పల్ మండలం నుంచి నాలుగు బస్సులను (చౌటుప్పల్, పంతంగి, చిన్నకొండూరు, కొయ్యలగూడెం) ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ సమీప వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవగాహన చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

## పేదలు, వ్యవసాయ కూలీలను మోసం చేస్తున్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ విమర్శలు




**యాదాద్రి భువనగిరి, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** పేదలు, వ్యవసాయ కూలీలపై అనేక భారాలు మోపుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ ఆరోపించారు. శనివారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు, వ్యవసాయ కూలీలకు కీలకమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తూ, పేర్లు మారుస్తూ, బడ్జెట్‌లో నిధులు కోత విధించిందని విమర్శించారు. దీని వల్ల గ్రామీణ ప్రజలపై అదనపు భారాలు పడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు స్పష్టమైన ప్రణాళికలు లేవని, బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయలేదని ఆయన అన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడం, పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు, కొత్త ఇందిరమ్మ ఇళ్లకు నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను విస్మరించిందని నర్సింహ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పేదలు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లెల పెంటయ్య, గంగాదేవి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు సిరిపంగి స్వామి, సల్లూరి కుమార్, కూకుట్ల చొక్కాకుమారి, కమిటీ సభ్యులు అందెల జ్యోతి, దొడ్డి బిక్షపతి, కొండపురం యాదగిరి, మెతుకు అంజయ్య, బొల్లెపల్లి కిషన్, కొమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, యువతకు స్వయం ఉపాధి కల్పించాలి

- దివిస్ ల్యాబ్స్ జీఎం సుధాకర్‌కు వినతి
- సానుకూలంగా స్పందించిన యాజమాన్యం

**చౌటుప్పల్, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** స్థానిక గ్రామాల్లో మహిళలు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని దివిస్ లాబొరేటరీస్ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. శనివారం చౌటుప్పల్ మండల పరిధిలోని పరిశ్రమలో జీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రతినిధులు అంకిరెడ్డిగూడెం సహా పరిసర గ్రామాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు సాంకేతిక శిక్షణ అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కోరారు. దీనిపై జీఎం సుధాకర్ సానుకూలంగా స్పందిస్తూ సంస్థ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణాభివృద్ధికి సహకరించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతినిధులు గత ఆరేళ్లుగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. అనంతరం "స్వామి వివేకానంద జీవిత చరిత్ర" పుస్తకాన్ని జీఎంకు బహుకరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పాలెం వెంకటేష్, సభ్యులు యాట మహేందర్, నల్ల ఉదయ్ కిరణ్, బడుగు హరినాథ్, భూమిక తదితరులు పాల్గొన్నారు.





## భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

- మత సామరస్యానికి ప్రతీక రంజాన్: చలమల్ల కృష్ణారెడ్డి
- జనగాం ఈద్గా వద్ద ముస్లింల సామూహిక నమాజ్

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** మండల పరిధిలోని జనగాం గ్రామంలో శనివారం రంజాన్ పండుగ వేడుకలు ఆధ్యాత్మిక శోభతో జరిగాయి. పవిత్ర రంజాన్ మాసం ముగియడంతో ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి స్థానిక ఈద్గా వద్దకు చేరుకున్నారు. మత గురువు ఖురాన్ హిత బోధన అనంతరం అందరూ కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ, పేదలకు జకాత్ అందజేయడం ద్వారా సోదరభావాన్ని చాటుకుంటారని కొనియాడారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ రజాక్ నివాసంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్, తుర్క కాషా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే బడేసాబ్, ఈద్గా కమిటీ చైర్మన్ మహ్మద్ ఖాలేక్, స్థానిక ముస్లిం నాయకులు మహ్మద్ మునీర్, మహ్మద్ ఉస్మాన్, కరీం, చాంద్ పాషా, ఏజాస్, అజీమ్, అహ్మద్, సలీం, భువనగిరి ఫిరోజ్, మండల కాంగ్రెస్ నాయకులు రాసమల్ల యాదయ్య, అందె నరేష్ యాదవ్, బైకని నరేందర్ యాదవ్, నేరడి నర్సింహ, నాతి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు





- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్

**చౌటుప్పల్, మార్చి 21 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు, పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్దకు చేరుకున్నారు. సామూహికంగా ప్రత్యేక నమాజ్ నిర్వహించి అల్లాను స్మరించుకున్నారు. లోకకల్యాణం కోసం, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్దకు చేరుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ వెంకటయ్య ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ త్యాగానికి, క్రమశిక్షణకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ నేత, కౌన్సిలర్లు మహమ్మద్ హన్ను, బద్రి గాలయ్య, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, పిల్లలమర్రి మధుసూదన్, దేప రమ్య రాజు, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ బాబా షరీఫ్, షాదీ ఖానా చైర్మన్ కరీం, మాజీ చైర్మన్లు ఖలీల్, ఎజాజ్ పాష, ఇంతియాజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.





## శివకుమార్ పట్టాభిషేకానికి ముహూర్తం ఫిక్స్ ?

కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. ఇప్పటివరకూ తెర వెనుక సాగిన సీఎం మార్పు చర్చలు ఇప్పుడు బాహాటంగా రోడ్డుపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ ఎమ్మెల్యేలు బహిరంగంగా డిమాండ్ చేయడం కన్నడ రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టిస్తోంది. తాజా రాజకీయ ప్రకంపనలకు కేంద్ర బిందువు ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుస్సేన్, చెన్నరాజ్ హట్టిహోలి. వీళ్లిద్దరూ డీకేకు కేవలం మద్దతు తెలపడమే కాకుండా, హైకమాండ్ ముందున్న లెక్కలను కూడా బయటపెట్టారు.పార్టీ కోసం రక్తం చిందించిన డీకేకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఇప్పటికే 80 నుండి 90 మంది ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన బహిరంగంగానే వెల్లడించారు. దీనికి మరో ఎమ్మెల్యే చెన్నరాజ్ హట్టిహోలి మరింత బలాన్ని చేకూర్చారు. “80 మంది కాదు, కాంగ్రెస్ నుంచి గెలిచిన మొత్తం 136 మంది ఎమ్మెల్యేలూ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు” అని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఏదో యాదృచ్ఛికంగా చేసినవి కావని, సిద్ధరామయ్య క్యాంప్‌కు ఒక స్పష్టమైన హెచ్చరిక లాంటివని రాజకీయ విశ్లేషకులు



భావిస్తున్నారు.2023 మేలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఈ సీటుపై గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించిన తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం పెద్ద యుద్ధమే జరిగింది. అప్పట్లో ఢిల్లీ పెద్దలు కుదిర్చిన '30 నెలల ఫార్ములా' అంటే రెండున్నరేళ్ల ఒప్పందం ఇప్పుడు డీకే వర్గానికి అస్త్రంగా మారింది. ఆ గడువు ముగియడంతోనే, ఎమ్మెల్యేలు ఇప్పుడు తమ గళాన్ని పెంచారు.సాధారణంగా ఏ పార్టీలోనైనా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుంది. కానీ, డీకే శివకుమార్ అనుచరులు ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నారంటే దీని వెనుక బలమైన స్కెచ్ ఉంది. సిద్ధరామయ్య ప్రజాకర్షణ ముందు డీకే వెనుకబడిపోకుండా, ఎమ్మెల్యేల బలం తనకే ఉందని నిరూపించుకోవడం దీని వెనుక ఉద్దేశం. సిద్ధరామయ్య తన 'అహింద' ఓటు బ్యాంకుతో పట్టు బిగిస్తుంటే, డీకే తన 'ఒక్కలిగ' సామాజిక వర్గ ఎమ్మెల్యేలను ఏకం చేస్తున్నారు. సిద్ధరామయ్య చుట్టూ ముదురుతున్న ముడా కేసు దర్యాప్తును ఆసరాగా చేసుకుని, నైతికత పేరుతో పదవిని బదిలీ చేయాలని కోరడం కూడా దీని వెనుక వ్యూహం కావచ్చు.ఎమ్మెల్యేలు బహిరంగంగా ప్రకటనలు చేస్తుంటే అధిష్టానం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సిద్ధరామయ్యను తప్పిస్తే వెనుకబడిన వర్గాలు ఏమౌతాయి? డీకేకు అవకాశం ఇవ్వకపోతే పార్టీకి ఆర్థిక బలం, ట్రబుల్ షూటింగ్ నెరవేరుతుందా? అనే సంకటంలో ఢిల్లీ పెద్దలు ఉన్నారు.మొత్తానికి ఎమ్మెల్యేల బహిరంగ వ్యాఖ్యలు కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు కేవలం ఊహాగానం కాదు, ఒక కార్యాచరణ అని స్పష్టం చేస్తోంది. డీకే శివకుమార్ వ్యూహాత్మకంగా తన అనుచరుల ద్వారా పావులు కదుపుతున్నారు. త్వరలోనే తనకు పట్టాభిషేకం ఖాయమనే ఆలోచనలో డీకే ఉన్నారు. ఆయన అనుచరుల తాజా వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. హైకమాండ్ పైన ఒత్తిడి తీసుకురావడం ద్వారా తమ పంచాన్ని నెగ్గించుకోవాలనుకుంటున్నారు. మరి సిద్ధరామయ్య ఈ ఎమ్మెల్యేల అస్త్రం నుండి తన కుర్చీని ఎలా కాపాడుకుంటారో చూడాలి.

## మీనాక్షి తెలంగాణ ఇన్ ఛార్జిగా ఉన్నారా



తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ లో జరుగుతున్న వ్యవహారాలను పట్టించుకోవడం లేదనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ చోట్ల రెబెల్స్ నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలకు ఆమె దిగడం లేదు. పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాల విషయంలో మీనాక్షి నటరాజన్ నానుస్తున్నారని అన్నారు. కనీసం మీనాక్షి నటరాజన్ రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలను హైకమాండ్ కు అసలు చెబుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా ఉంది. ఆమె ఏదో ఇన్ ఛార్జిగా ఉన్నట్లే ఉంటున్నారు తప్పించి ఎలాంటి కఠిన నిర్ణయాల వంటి జోలికి వెళ్లడం లేదు. దీనిని అలుసుగా తీసుకుని కాంగ్రెస్ నేతలు కొందరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయిమీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీ కోటరీలో వ్యక్తి అంటారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటారనే ఆమెను తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జిగా నియమించారు. మీనాక్షి నటరాజన్ చాలా సింపుల్ గా ఉంటారు. గతంలో ఇన్ ఛార్జుల మాదిరిగా మీనాక్షి పార్టీ బలోపేతానికి తప్పించి మరే ఆలోచన చేయరు. తెలంగాణకు వస్తే హంగు ఆర్భాటాలను కూడా ప్రదర్శించరు. స్టార్ హోటల్స్ బస చేయరు. అలాగే ఏ స్థాయి నేత ఫోన్ చేసిన వెంటనే రెస్పాండ్ అవుతారు. అలాంటి మీనాక్షి నటరాజన్ గత కొద్ది రోజుల నుంచి తెలంగాణ కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలపై ఆమె స్పందించకపోవడం, పార్టీ అగ్ర నాయకత్వానికి కూడా తెలియజేయకపోవడంపైనే ఇప్పుడు గాంధీ భవన్ లో చర్చ జరుగుతుంది.మున్సిపల్ ఎన్నికలకుసంబంధించి కానీ, పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు సంబంధించి అసలు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా నేతల్లో ఉంది. జీవన్ రెడ్డి వ్యవహారం తీసుకుంటేఅది వెంటనే హైకమాండ్ కు చేరవేయాలి. ఆయన దశాబ్దాలుగా పార్టీలో ఉన్న నేత అని మీనాక్షికి తెలుసు. కనీసం ఆయన వద్దకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం కూడా మీనాక్షి చేయలేదు.

## ఎన్నికలంటే....డబ్బునోళ్ల దందా !

పార్లమెంట్ బడ్జెట్ తొలిదశ సమావేశాలు ముగిసాయి. యధావిధిగా రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ ప్రసంగం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటివన్నీ యథాలాపంగా ముగించేశారు. నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్నట్లుగా..ఈ సమావేశాలను కూడా మొక్కుబడిగానే ముగించేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో పెద్దగా మెరుపేలమీ లేవు. ప్రభుత్వం చెబుతన్నదే చర్వితచరణంగా చెబుతున్నారు. ఇకపోతే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ఒకటి ఈ సమావేశాల్లో ప్రధాన అంశంగా మారింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన ప్రతిపక్షం ఆరోపణగా ఉంది. స్పీకర్, ప్రబుత్వానికి సంబంధించినంత వరకు ఇదో మరక లాంటిదే. చరిత్రలో ఫలానా స్పీకర్ తీరుపై అవిశ్వాసం పెట్టారని గుర్తుండిపోతుంది.నిజానికి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎంతో ముఖ్యమైనవి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలోనే అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. పాలకపక్షాన్ని విపక్షాలు నిలదీస్తాయి. విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. అలాగే అవకాశం వచ్చేలా విపక్షం కూడా వ్యవహరించడం లేదు. చర్చ జరిగితే ప్రజల సమస్యలు దేశానికి తెలిసేవి. కానీ మొక్కుబడి సమావేశాలు కప్పి పుచ్చుకోవడానికి, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాలకపక్షం చేస్తున్న ప్రయత్నాలు ఎంతోకాలం సాగవని గుర్తించాలి. అమెరికాతో ఒప్పందం కావచ్చు, యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందం కావచ్చు..పార్లమెంటు చర్చించాల్సి ఉంది. ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చ సాగాలి. కానీ అలా సాగడం లేదు. అధికార పార్టీ నేతలు అడుగడుగునా రాహుల్ గాంధీ నిలదీసి ప్రశ్నిస్తున్నారు. దానిబదులు అతను ఏం చెబుతాడో తెలుసుకుంటే బాగుండేది. రాహుల్ గాంధీ ఇస్తున్న వాయిదా దేశ ఉత్పత్తులపై సుంకాన్ని జీరో శాతానికి తేవడం అంటే.. ఇక్కడి చిన్న, సన్నకారు వ్యవసాయదారుల్ని, వ్యాపారుల్ని రోడ్డున పడేయడమేనని అంటున్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు పార్లమెంట్ చర్చల ద్వారా పరిష్కారం చూపాల్సి ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పంద నిర్ణయం చిన్నవిషయం కాదు. ఇది కేవలం మోడీకి సంబంధించినది అస్సలే కాదు. పార్లమెంటును విశ్వాసం తీసుకోవాల్సింది. కీలకమైన విషయాల్లో ఈ దేశ పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవడం అవసరం. కానీ అలా జరగడంలేదు.



సాగుతున్న తీరు దురదృష్టకరం. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్యసభలోనే ప్రధాని సమాదానం చెప్పి సరిపుచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చాక విపక్షాల సమస్యలను ఆకళింపు చేసుకోవడమో లేదా, వారినుంచి చర్చను ఆహ్వానించడమో జరగడం లేదు. అర్థవంతమైన చర్చలను చూసి పార్లమెంట్ ఎన్నో ఏళ్లు గడిచి పోతున్నాయి. పార్లమెంటుకు ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం చాలా బాధాకరం. ప్రతిపక్ష నేతగా రాహుల్ ప్రసంగానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే విపక్షనేతను పార్లమెంట్‌కు అనర్హుడిని చేయాలని బిజెపి సభ్యుడు కూడా ప్రతిపాదించడం కేవలం కక్షసాధింపు చర్యగానే చూడాలి. తమ తప్పుల్ని తీర్మానాలు ఎలాగూ చర్చకు రావడం లేదు. కనీసం మరో విధంగా చర్చకు తీసుకునే అవకాశం గురించి రాహుల్ ఆలోచించడం లేదు. ఒకవేళ సమస్యలపై సిరయస్‌గానే చర్చ జరగాల్సి ఉంటే అందుకు అనేక రకాల మార్గాలు ఉన్నాయి. రూల్స్ పొజిషన్ ఉంది. అలా చర్చను కోరే అవకాశం సులువు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేర నడుస్తున్న ప్రహసనంలో ఏం జరిగిందో దేశ ప్రజలకు తెలియాలి. అమెరికా మధ్యంతర ఒప్పందం కారణంగా దాని ప్రభావం మనదేశ రైతాంగంపై పడుతుందన్న భావన ఉంది. అలాంటిదేమీ లేదని పాలకవర్గం చెబుతోంది. అవే విషయం పార్లమెంట్ వేదికగా చెప్పివుంటే బాగుండేది. వాణిజ్య ఒప్పందం కోసం రష్యాతో చమురు కొనుగోళ్లు తగ్గించినా అమెరికా మనల్ని పాకిస్తాన్‌తో సమానంగా చూడడం దురదృష్టకరం. ఇప్పుడు ప్రధానిగా ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మోడీపై ఉంది. అనేక సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌కు అవకాశం కల్పించాలి. ప్రజల అనుమానాలు నివృత్తి చేయాలి. దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నట్లు వస్తున్న ఆరోపణలకు సవివరమైన సమాధానం రావాల్సి ఉంది. అప్పుడే పార్లమెంట్‌కు విలువ ఉంటుంది. ఇందుకు తాము అనుగుణంగా ఉన్నామా లేమా అన్నది ఇరుపక్షాలు బేరీజు వేసుకోవాల్సి సమయం కూడా.

## రేవంత్ వర్సెస్ రాజగోపాల్

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మునుగోడు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపుతున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.మంత్రి పదవి కోసం రెండేళ్లుగా సర్వ శక్తులు ఒడ్డుతున్న వార్తల్లోకెక్కడం కొత్తేమి కాదు. సమయం దొరికినప్పుడల్లా మంత్రి పదవి ఇవ్వాలంటూ సీఎం ను,అధిష్టానాన్ని టార్గెట్ చేసే ఆ ఎమ్మెల్యే ఇప్పుడు నేరుగా సీఎం కుర్చీ పై కన్నేశారు.ఓ మెట్టు పైకెక్కి 'పులివెందులలో రాజశేఖర్ రెడ్డి ఎట్లనో మునుగోడులో రాజగోపాల్ రెడ్డి అట్లా...!! అంటూ తన నియోజకవర్గంలో స్పీచ్ ఉమొదలు పెట్టారు.ఇది కేవలం ఉపమానం కాదు. మంత్రి పదవి ఇవ్వడం మాట ఇచ్చారు, మాట నిలబెట్టాలి, కపోతే నా టార్గెట్ మారదు. డైరెక్ట్ సీఎం చైర్ వైపే అంటూ అల్టిమేటం జారీ చేశారు.ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఎవరిని ఉద్దేశించి చేశారు!.నేరుగా సీఎం రేవంత్ రెడ్డి కుర్చీ కే ఎసరు పెట్టారా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఓపెన్గానే నడుస్తోంది.ఒకవైపు రేవంత్ రెడ్డి అధికార సమతుల్యతలు కేబినెట్ బ్యాలెన్స్, సామాజిక సమీకరణలు, మరోవైపు రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగత బలం, నియోజకవర్గంపై సంపూర్ణ పట్టు ఇతర అంశాల సంకేతాలు రాజగోపాల్ రెడ్డి మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.మొత్తానికి, మునుగోడు నుంచి వచ్చిన ఈ గర్జన కాంగ్రెస్లో నిశ్శబ్దాన్ని చెదరగొట్టింది.ఇది లేక రేవంత్ జం రాజగోపాల్ రెడ్డి పవర్ పాలిటిక్స్ తో కొత్త అధ్యాయం మొదలవుతుందా?రాబోయే రోజుల్లో ఈ 'చేతి పట్టు'తుఫాన్ గా మారుతుందా?..మంత్రి పదవి తో ఆగుతుందా వేచి చూడాలి.

## క్యాబినెట్ విస్తరణ చేయనున్నారా?

**కీలక పదవులను భర్తీతో పాటు క్యాబినెట్ విస్తరణ చేయనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఆ తర్వాత నేతలకు ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి పదవులతో పాటు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టాలని భావిస్తున్నారట. అయితే కొందరు తమకు పదవులు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని అల్టిమేటం జారీ చేస్తున్నారట.**

ఇంకొందరు అయితే తమకు పదవులు ఇవ్వకపోయినా సరే, కానీ వేరే పార్టీ నుంచి వచ్చిన వలస నేతలకు పోస్టులు ఇవ్వొద్దని అగ్రనేతలకు తేల్చి చెబుతున్నారట. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర స్టార్ట్ కానుందట.క్యాబినెట్‌లో మిగిలిన రెండు మంత్రి పదవులతో పాటు పలు కీలకమైన కార్పొరేషన్ పదవులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోందట. మరోవైపు కులసంఘాల కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీపై కూడా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే మున్సిపల్ ఎన్నికల కోడ్ ఉన్నవారికి గతంలో హామీ ఇచ్చినవారికి అమాత్య పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, మహిళా కమిషన్ ఛైర్మన్ కేవలం ఏడాదిన్నర మాత్రమే పదవిలో కొనసాగారు. కమిషన్ పదవీకాలం ఐదేళ్లు కాగా.. మూడున్నరేళ్లు ఈ పదవిలో ఉన్న సునితా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో రాజీనామా



రావడంతో పదవుల భర్తీకి బ్రేకులు పడ్డట్లు చెప్పుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులు భర్తీ చేస్తామని చెబుతున్నారట ప్రభుత్వ పెద్దలు.క్యాబినెట్ బెర్తుల కోసం హస్తం పార్టీలో హెవీ కాంపిటేషన్ ఉంది. సామాజిక వర్గాల వారీగా అమాత్య యోగం కోసం పోటీ పడుతున్నారు నేతలు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇక రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి గట్టి పట్టుబడుతున్నారు.ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్టానానికి విన్నవించుకున్నారు. ఇంతలో సీఎం రేవంత్ రెడ్డి పరిగి సభలో చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిని మున్సిపల్ శాఖ మంత్రిని చేస్తానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్ ఫ్లోలో అలా మాట్లాడారా లేక రంజిత్‌రెడ్డిని మంత్రి చేయబోతున్నారా అనేది డిస్కషన్ పాయింట్‌గా మారింది.ఈ క్రమంలోనే వలస వచ్చిన నేతలకు కాకుండా..పార్టీలో ముందు నుంచి ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వంటి వారు పోటీ పడుతున్నారు.ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వం భర్తీ చేయాల్సిన కీలక పదవుల్లో మహిళా కమిషన్ ఒకటి. మహిళా కమిషన్ ఛైర్మన్‌తో పాటు సభ్యులుగా..కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకంగా వ్యవహరించిన మహిళలకే అవకాశం ఇవ్వాలని హస్తం పార్టీ మహిళా నేతలు కోరుతున్నారు. అయితే ఈ పదవిని ప్రస్తుత జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి పదవీకాలం ముగుస్తుంది. ఆ త్వరాత ఎన్నికల కోడ్ ముగియగానే విజయలక్ష్మికి మహిళా కమిషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టబోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై మహిళా కాంగ్రెస్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతగానో కష్టపడిన తమను కాదని వేరే పార్టీలో పదవులు అనుభవించిన వారికి మహిళా కమిషన్ లాంటి కీలక పదవి ఇవ్వడం సరైన పద్ధతి కాదని పార్టీ పెద్దల దగ్గర గోడును వెళ్లబోసుకున్నారట.వాస్తవానికి ఇప్పటివరకు పనిచేసిన చేశారు. దీంతో మిగిలిన ఏడాదిన్నర కోసమే నేరెళ్ల శారదకు అవకాశం ఇచ్చారు. ఏడాదిన్నర కాలం కూడా సమర్ధవంతంగా పనిచేశారన్న పేరు కూడా తెచ్చుకున్నారు. దీంతో ఆమెకు ఎక్స్‌టెన్షన్ ఖాయమనే అంతా భావించారు.అయితే కేకే కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి పదవీకాలం ఈ నెల ముగుస్తుండడంతో ఆమెకు మహిళా కమిషన్ ఛైర్మన్ పోస్టు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే ఇప్పటివరకు శారదకు ఎక్స్ టెన్షన్ ఇవ్వకుండా..కొత్త వారితో భర్తీ చేయకుండా ఆపారన్న టాక్ నడుస్తోంది. దీనిపై ఒరిజినల్ కాంగ్రెస్ మహిళా నేతల్లో అసహనం వ్యక్తం అవుతోంది.డిమాండ్లు, అభ్యంతరాలు, ఆశావహులు ఈక్వేషన్స్ ఎలా ఉన్నా..మార్చి ఫస్ట్ వీక్‌లో కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరం మాత్రం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. అయితే పదవుల పందేరంలో ఒరిజినల్ కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్ నేతల్లో ఎవరి ఆశలు నెరవెరుతాయో చూడాలి మరి.



## పెద్ది సెకండ్ సింగిల్ విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' పై ప్రేక్షకుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' మ్యూజిక్ లవర్స్‌ను విపరీతంగా ఆకట్టుకుని ఆడియో ప్లాట్‌ఫామ్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు అందరి దృష్టి సినిమా నుంచి రాబోతున్న సెకండ్ సింగిల్ పై పడింది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు మరింత ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజా సమాచారం ప్రకారం, రెండో పాట ఒక పవర్‌ఫుల్ ఇంట్రడక్షన్ సాంగ్ గా ఉండనుందని తెలుస్తోంది. రామ్ చరణ్ పాత్రను గ్రాండ్‌గా ఎలివేట్ చేసే ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అదిరిపోయే స్టెప్పులు డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సాంగ్‌లో చరణ్ మాస్ ఎనర్జీ, స్టైల్ అభిమానులను అలరిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఈ పాట గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ సాంగ్ ఖచ్చితంగా ఒక బ్లాస్ట్ లా ఉంటుంది' అంటూ అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. వాస్తవానికి ఈ పాటను డిసెంబర్ చివర్లో విడుదల చేయాలనుకున్నప్పటికీ, పలు కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్టు సమాచారం. అధికారిక ప్రకటన ఈ వారంలో వెలువడే అవకాశముందని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అదేవిధంగా కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో కూడిన స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం భావోద్వేగాలు, యాక్షన్, సంగీతం మేళవింపుతో ఉండబోతోందని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30 న ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సాంగ్‌తోనే సినిమాపై భారీ హైప్ ఏర్పడగా, రాబోయే సెకండ్ సింగిల్ ఆ అంచనాలను మరింత పెంచేలా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## అమ్మ సురేఖావాణికి మళ్లీ పెళ్లి చేయాలనుకుంటున్నా

### అమరావతికి ఆహ్వానం మూవీలో సుప్రీత ఎంట్రీ



టాలీవుడ్ సీనియర్ నటి సురేఖా వాణి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'బొమ్మరిల్లు' సినిమాతో ఆమెకు మంచి పేరు వచ్చింది. కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సురేఖా వాణి ఇప్పుడు తెరపై తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆమె కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి విడుదల కానుండగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుప్రీత తన తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో సుప్రీత మాట్లాడుతూ తన తల్లి సురేఖా వాణికి మళ్లీ పెళ్లి చేయాలనే ఆలోచన తనకు ఉందని వెల్లడించింది. 'రీసెంట్‌గా ఈ విషయం అమ్మతో చెప్పాను. కానీ ఆమె మాత్రం నాన్న జ్ఞాపకాలతోనే జీవించాలనుకుంటోంది. ఆ ప్లేస్‌లోకి వేరే ఎవరినీ రానివ్వకూడదని భావిస్తోంది. అదే సమాధానం నాకు చెప్పిందని సుప్రీత తెలిపింది. అయితే తాను పెళ్లి చేసుకునేలోపు అయినా అమ్మకు మంచి జీవిత భాగస్వామి దొరికితే బాగుంటుందని కోరుకుంటున్నానని చెప్పింది. సురేఖా వాణి కెరీర్ గురించి కూడా సుప్రీత మాట్లాడింది. ఒకప్పుడు తన తల్లి ఎంతో బిజీ ఆర్టిస్ట్ అని, ఇప్పుడు మాత్రం అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొంది. మేకప్ వేసుకుని ఏడాదిన్నర దాటిపోయింది. సినిమాల్లో నటించాలని అమ్మకు ఇంకా ఆసక్తి ఉంది. కానీ అవకాశాలు రావడం లేదు అని ఫీల్ అవుతోంది. కనీసం ఒక మంచి పాత్ర వచ్చినా చేయాలని ఉందని చెబుతోంది అని తెలిపింది. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇక సుప్రీత హీరోయిన్‌గా పరిచయం అవుతున్న 'అమరావతికి ఆహ్వానం' చిత్రం హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కింది. ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, శివకంఠనేని కీలక పాత్రల్లో నటించారు. జీవీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వరరావు నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో మిస్టరీ, క్షుద్రపూజలు, మూఢనమ్మకాల అంశాలతో కథ నడుస్తున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.

## అమెరికా వీసా కష్టాలతో గాయపడ్డ సింహం

### ట్రైజర్ విడుదలలో నటదర్శకుడు తరుణ్ భాస్కర్

నూతన తరహా సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. 'పెళ్లి చూపులు'తో టాలీవుడ్‌కు న్యూ ఏజ్ కథనం ఎలా ఉండాలో చూపించిన ఆయన, 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ వరుస చిత్రాలతో బిజీ అవుతున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'గాయపడ్డ సింహం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. దర్శకుడు పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్ కలిపిన 'ట్రైజర్' ను తాజాగా విడుదల చేశారు. విడుదలైన ట్రైజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్ అంశాలను కలగలిపి సరదాగా రూపొందించినట్లు కనిపిస్తోంది. కథాంశం విషయానికి వస్తే? అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుంది.

## మృణాళ్ చుట్టూ పెళ్లి రూమర్లు

బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నారు. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ డేటింగ్ వార్తలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. సిద్ధాంత్‌తో మృణాల్ తరచుగా కలిసి కనిపించడం కూడా కొత్త చర్చలకు దారితీస్తోంది. అయితే వీరిద్దరూ కలిసి సినిమా చేస్తున్న కారణంగా ప్రమోషన్లలో భాగంగానే కలుస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, అడివి శేష్‌తో కలిసి నటించిన తెలుగు సినిమా 'డెకాయిట్' ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది.





## ఎ పుష్ప 2 తర్వాత బన్నీ నెక్స్ట్ స్టెప్.. జోడీగా ప్రభాస్ హీరోయిన్..!

'పుష్ప 2'తో దేశవ్యాప్తంగా అల్లు అర్జున్ స్టార్‌డమ్ ఏ స్థాయికి చేరిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాస్ ఇమేజ్‌ను పాన్-ఇండియా రేంజ్‌లో మరింత స్ట్రాంగ్‌గా ఎస్టాబ్లిష్ చేసిన ఈ సినిమా తర్వాత బన్నీ చేసే ప్రతి ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్-ఇండియా సినిమాలో నటిస్తున్నాడు. హై ఎనర్జీ యాక్షన్, గట్టి ఎమోషన్, కమర్షియల్ టచ్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా బన్నీ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అట్లీ ప్రాజెక్ట్ పూర్తయ్యాక అల్లు అర్జున్ పూర్తిగా డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావాలని ప్లాన్ చేస్తున్నాడట. అదే క్రమంలో ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన అల్లు అర్జున్ -- లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి సినిమాలతో ఇంటెన్స్ నరేషన్, స్టైలిష్ యాక్షన్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్‌తో బన్నీ సినిమా అంటే సహజంగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ సినిమా పాన్-ఇండియా స్థాయిలో రూపొందనుండగా, యాక్షన్‌తో పాటు ఎమోషనల్ డెప్త్ కూడా బలంగా ఉండనుందని సమాచారం. లోకేష్ మార్క్ రియలిస్టిక్ టోన్‌కు అల్లు అర్జున్ ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ జతకలిస్తే ఓ ఫ్రెష్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ వస్తుందని అభిమానులు భావిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్‌లు ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత గ్రాండ్‌గా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎంపికపై తాజాగా ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్‌ని ఫిమేల్ లీడ్‌గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ప్రభాస్‌తో 'సాహో'లో నటించడం ద్వారా తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రద్ధా, ఇటీవల 'స్త్రీ 2' సినిమాతో తన నటనకు విమర్శకుల ప్రశంసలు, అవార్డులు కూడా అందుకుంది. ఆ సినిమా తర్వాత ఆమె చేసే ప్రతి ప్రాజెక్ట్‌పై నార్త్‌తో పాటు సౌత్‌లోనూ ఆసక్తి పెరిగింది.